# మనసులో వేదన

"పిల్లవాడు నచ్చాడా?" అంది పిన్ని మెల్లగా వచ్చి ఎదురుగా బల్లమీద కూర్చుంటూ.

రాధ ఉలిక్కిపడింది. ఏదో పుస్తకం చదువుకుంటూ వుంది. హటాత్తుగా అడిగిన ప్రశ్నకు అదరిపడింది. ఏం చెప్పాలో తెలియలేదు. ఆ క్రిందటిరోజే ఒక పెళ్ళికొడుకు వచ్చి తనని చూసి వెళ్ళాడు. పిల్లవాడు బాగానే వున్నాడు. బాంకులో ఉద్యోగం చేస్తున్నాడు. ఎమ్.ఏ. దాకా చదువుకున్నాడు. తల్లీ తండ్రీ లేరు. ఒక అన్నగారు వున్నాడు. అతనెక్కడో నార్త్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. పెళ్ళై ఇద్దరు పిల్లలు. సంబంధం బాగానే వుంది. అయితే తనకు పెళ్ళి చేసుకోవాలని లేదు. అందుకే ఇన్నాళ్ళు ఏదో సాకుతో దాటేస్తోంది. తనకు 24 ఏండ్లు. తనూ ఎమ్.ఏ. చేసి కాలేజీలో ఉద్యోగంచేస్తోంది. పెళ్ళికి తొందర లేదు. అయినా పెళ్ళి చేసుకోవలసిన వయసే. ఇంకా వయసు దాటిపోతే అసలు పెళ్ళి కాకుండా వుండే ప్రమాదం వుంది. కాని ఎంత సర్దుకున్నా మనసు పెళ్ళికి ఒప్పుకోటం లేదు. మనసులో ఏమూలో ఎన్నాళ్ళగానో దాగి వున్న వేదన పదేపదే అడ్డువస్తోంది. ఇప్పుడు పిన్నికి ఏం చెప్పటమో తెలియలేదు. పెళ్ళి వద్దన్నా, పిల్లవాడు నచ్చలేదన్నా పిన్ని బాధపడుతుంది. ఎటూ తోచక మెల్లగా అడిగింది. "పిల్లవాడికి నేను నచ్చానా?" పిన్ని సంతోషంగా చెప్పింది. "ఆఁ అతను నిన్నే అంగీకారం తెలిపి వెళ్ళాడు. పైగ నీవు కట్నం తీసుకునేవాడిని చేసుకోనని భీష్మించుకు కూచున్నావుగదా? అతను చాలా మంచివాడు, కట్నం అడగటం లేదు. పైగా పెళ్ళి కూడా సింపుల్‌గా చెయ్యమంటున్నాడు. అతనికీ ఉద్యోగం ఈ ఊళ్ళోనేగదా? ఇద్దరూ కలిసే వుండవచ్చు. నువ్వూ వుద్యోగం కొన్నాళ్ళ దాకా మాననక్కరలేదు. మీ బాబాయి నేను మంచి సంబంధం అనుకుంటున్నాం. మరి నువ్వుకూడా ఏదో తేల్చిచెప్పు. మనమూ తొందరగా అతనికి ఏదోమాట చెప్పాలి గదా?"

రాధకు ఎటూ పాలుపోలేదు. మెల్లగా అంది. "కాస్త ఆలోచించుకోనీ, తరువాత చెపుతాను."

"సరే; నీ ఇష్టం. ఆలోచించుకునే చెప్పు. తొందర దేనికి." అంటూ పిన్ని లేచి వెళ్ళిపోయింది. రాధ అమ్మయ్య అనుకుంది. ఇప్పుడే చెప్పమని తొందర పెట్టలేదు. పిన్ని మంచిది అనుకుంది. తాను ఈ పెళ్ళికి ఒప్పుకుని పిన్నిని,బాబాయిని సంతోష పెట్టగలిగితే బాగుంటుంది. అయితే——!

రాధకు మళ్ళా గతం అంతా ఒక్కసారి గుర్తువచ్చింది తనకు చిన్నప్పుడే తండ్రి పోయాడు. తనూ, అమ్మా, పిన్ని, బాబాయి దగ్గరే ఉండేవారు. వాళ్ళకు పిల్లలులేరు. అంచేత అందరూ తన్ను అల్లారు ముద్దుగానే చూసుకునేవారు. తనకు ఏడెనిమిదేళ్ళ వయస్సు వచ్చాక అకస్మాత్తుగా అమ్మకూడా పోయింది. అప్పటినుంచి పిన్నీ బాబాయే తనకు తల్లీ తండ్రీ అయ్యారు. వాళ్ళు తనను ప్రేమగా చూసుకున్నారు. చక్కగా చదివించారు. ఉద్యోగం చేస్తానంటే సరే అన్నారు. ఇప్పుడే పెళ్ళివద్దు అంటే సరే నీ ఇష్టం అన్నారు. పెళ్ళా కొన్నాళ్ళకి కట్నం అడిగే వాళ్ళని చేసుకోను అంటే అందుకూ ఒప్పుకున్నారు. కాని వాళ్ళ వంతుగా అడపాదడపా సంబంధాలు మాత్రం చూస్తూనే ఉన్నారు. అమ్మా, నాన్నా, తనకు ఇచ్చిన ఆస్తి జాగ్రతగా కాపాడుతున్నారు. తనకు ఏ లోపమూ లేదు. అయితే——!

చిన్నప్పుడు ఎప్పుడో జరిగిన సంఘటన ఒకటి మనసులో శిలలా తిష్ఠవేసుకు కూర్చుంది. పదే పదే గుర్తువస్తోంది. వయసు వచ్చేకొద్దీ ఆ జ్ఞాపకం గుండెల్లో బరువుగా మనసుకు బాధ కలిగిస్తోంది. ఎంత మరచి పోదామన్నా అది మరపురావటంలేదు. తనకు ఏదో ఘోరమైన అన్యాయం జరిగినట్లు గుండె ఆక్రోశిస్తోంది. అది గుర్తువచ్చినప్పుడల్లా మనస్సు భయంతో దిగులుతో వణికి పోతోంది. కళ్ళు నీళ్ళతో నిండుతున్నాయి.

అప్పుడు తనకెంత వయసు ఉంటుంది? ఏమో, గుర్తులేదు. చాలా చిన్నవయసు ఇంట్లో ఒక నౌకరు ఉండేవాడు. వాడిపేరు సోము కాబోలు? సరిగా గుర్తులేదు. వాడు ఎప్పుడూ తన్ను ఎత్తుకుని తిప్పుతూ ఉండేవాడు. తోటలోకి తీసుకువెళ్ళేవాడు. బజారులోకి షికారు తీసుకువెళ్ళేవాడు. అమ్మా, పిన్నీ అంతా వాడు చాలా మంచివాడు అనుకునేవారు. ఒకరోజు వాడు——

ఒక రోజు వాడు తన్ను సాయంత్రపు వేళ మెట్లకింద ఒక చీకటి గదిలోకి తీసుకు వెళ్ళాడు. అక్కడ యెవరూ లేరు. ఇల్లు లంకంత ఇల్లు. ఇంట్లో మనుష్యులు తక్కువ, సాయంత్రపు వేళ ఆ మూల గదిలో యెవరూ ఉండరు. అక్కడ వాడు తనను నేలమీద పడుకోబెట్టాడు. ఆ తరువాత వాడు తనమీద పడుకున్నాడు. వాడు ఏంచేశాడో తెలీదు. తనకు అంతకన్నా గుర్తులేదు. ఇప్పుడు చాలా రోజుల తరువాత, నిర్మానుష్యంగా వున్న ఆ చీకటిగది. ఆ దృశ్యం మనస్సులో ఏదో చాలా బాధాకరంగా భయంగా, ఏవగింపుగా ఉంటుంది.

ఆ తరువాత రెండురోజులకు అమ్మ తనను చాటుగా తీసుకెళ్ళి మెల్లగా, "నిన్ను ఎవరైనా ఏమైనా చేశారా?" అని అడిగింది. తను అమాయకంగా చెప్పింది. ఆ నౌకరు తనను చీకటిగదిలోకి తీసుకువెళ్ళడమూ, క్రిందపడుకోబెట్టడమూ, వాడు తనమీద పడుకున్న విషయమూ చెప్పింది. ఇవన్నీ ఎందుకు చెప్పాలని తోచిందో తెలియదు.

ఆ రాత్రి పన్నెండు గంటలకు బాబాయి ఆ నౌకర్ని ఒంటరిగా పిలిచి చావగొట్టాడు. క్రింద తోటలో బాబాయి వాడిని కొట్టడమూ, పైన డాబామీద నుంచి అమ్మ ఆ దృశ్యం భయం భయంగా చూస్తూవుండడమూ, ఇవన్నీ అక్కడే ఓ మంచం మీద పడుకున్న తను గమనిస్తూనేవుంది. ఆ తరువాత ఆ మర్నాడే ఆ నౌకరును పనిలోంచి తీసివేశారు.

ఆ తరువాత తనను ఏదో పొరుగూరు తీసుకువెళ్ళారు. అక్కడ ఆస్పత్రిలో చేర్పించి

శ్రీపంటి శారదాదేవి

నెలరోజులు వైద్యం చేయించారు. ఆ తరువాత మళ్లా యింటికి తీసుకువచ్చారు. ఇవన్నీ లీలగా తనకు కొంచెం కొంచెం గుర్తు వున్నాయి.


అసలు ఏం జరిగింది? ఆ చీకటిగదిలో ఆ సాయంత్రం వాడు తన్ను చెరిచేడా? అలా అయితే తనకు విపరీతమైన బాధ కలిగి వుండాలే? కేకలు పెట్టినట్లు ఏమీ గుర్తులేదే? మరి అయితే ఆ రాత్రి బాబాయి వాడిని ఎందుకు కొట్టాడు? తనకు ఆస్పత్రిలో వైద్యం ఎందుకు చేయించారు? ఏమో! ఏమీ సరిగా తెలియటంలేదు. అన్నీ ఏదో లీలగా గుర్తువున్నాయి. అడుగుదమంటే యిప్పుడు అమ్మలేదు. పిన్నిని అడగడానికి చాలా సంకోచంగా వుంటుంది. అందుకే ఆ బాధ యెవరికీ చెప్పుకోకుండా మనసులోనే దాచుకుని లోపల్లోపలే కుమిలిపోతోంది.


అభమూ శుభమూ తెలియని వయసులో, తన్ను తాను సంరక్షించుకోలేని పరిస్థితిలో తనకేదో మహాపకారం జరిగింది. తీరని అన్యాయం జరిగింది. అది తలచుకున్నప్పుడల్లా గుండె కుమిలిపోతోంది. పసిపిల్లలను కూడా బలిగొనే పశుత్వం. ఆడదానికి సంరక్షణ ఎక్కడ? కలవారి ఇంట్లో పుట్టి కంటికి రెప్పలా కాపాడబడిన తన బ్రతుకే ఇలాఅయితే, మధ్యతరగతి కుటుంబాల్లో, బీద కుటుంబాల్లో పుట్టిన ఆడపిల్లలు ఇలా ఎన్ని గండాలు తప్పించుకుని, ఎందరి చేతుల్లోంచి తప్పించుకుని ఒడ్డుకు చేరగలుగుతున్నారు? బాధాకరమైన బాల్యం తలచుకున్నప్పుడల్లా ఎంతో వేదనగా ఉంటుంది.

క్రమంగా తను పెళ్ళికి పనికిరాదు అనే భావం ఏదో తన మనసులో గాఢంగా నాటుకుంది. తను పవిత్రమైంది కాకపోవచ్చు. చిన్నప్పుడు తనకేదో వైద్యం చేయించారు. ఎందుకో తెలీదు. ఆ వ్యాధి సంబంధమైన బీజాలు ఏవైనా యింకా తనలో ఉండవచ్చు. అందుకే తను పెళ్ళికి పనికిరాదు, ఈ బాధ మనసును కలచివేస్తోంది. పెళ్ళి తప్పించుకోటానికి రకరకాల సాకులు చెప్పి తప్పించుకుంటోంది. కొన్నాళ్ళు ఉద్యోగం చేస్తానంది. ఆ తరువాత కొన్నాళ్ళు కట్నం తీసుకునే వాణ్ణి చేసుకోటం యిష్టంలేదు అని కాలం గడిపింది. పిన్ని దేనికీ అభ్యంతరం చెప్పలేదు. కాని అప్పుడప్పుడూ హితబోధ చేస్తూ ఉంటుంది. "అమ్మా! మేము పెద్దవాళ్ళం అవుతున్నాంగదా! మరి నువ్వు పెళ్ళిచేసుకుని నీకూ ఒక సంసారం అంటూ ఏర్పడితే బాగుంటుంది. లేకపోతే ఒంటరిదానివై పోతావు. కాలేజిలో వుద్యోగం చేసుకుంటూ, నలుగురితో సరదాగా తిరుగుతూ ఈ వయసులో ఇప్పుడు బాగానే ఉంటుంది. మరి కాస్త వయసు పెరిగాక ఒంటరితనం మిగులుతుంది. నీకూ భర్తా, బిడ్డా పాపా ఉంటే బాగుంటుంది. ఆలోచించుకో!" ఈ ధోరణిలో అప్పుడప్పుడూ మంచి చెబుతూ ఉంటుంది. తనకెటూ పాలుపోదు, మనసులో గుచ్చుకున్న ముల్లు మాయమవదు.

మరి ఇప్పుడు కట్నంకూడా లేకుండా చేసుకుంటానని ఇతను ముందుకు వచ్చాడు. ఇప్పుడు ఏం చెప్పాలి? ఏం చెయ్యాలి? మర్నాడు పిన్ని మళ్ళా అడిగింది. "ఏం రాధా! ఏమాలోచించావు?" అని. రాధకు ఏమీ పాలుపోలేదు. యధాలాపంగా "సరే, నా యిష్టం" అంది. పిన్ని సంతోషించింది.

ఒకనెలరోజులలోపల పెద్ద ఆడంబరం ఏమీ లేకుండా ఏదో పెద్ద పండగలా పెళ్ళి సరళంగా జరిగిపోయింది. పెళ్ళైన రాత్రి రాధను చక్కగా అలంకరించి గదిలోకి పంపారు. పెళ్ళికొడుకు ఆమెని చూచి చిరు నవ్వు నవ్వాడు. ఆమె నవ్వలేదు. భయంగా నిల్చుంది. అతను ఆప్యాయంగా దగ్గరకు వచ్చి కుర్చీలో కూర్చోమని సంజ్ఞ చేశాడు. ఆమె యాంత్రికంగా వెళ్ళి కూర్చుంది. అప్పుడు అతను ఆమెకేసి నిదానంగా చూశాడు. ఆమె భయంతో వణకిపోతోంది. ఒళ్ళంతా ముచ్చెమటలు పోస్తున్నాయి. అతని మనసు కలత చెందింది. అయినా పైకి ఏం అనలేదు. "ఏమిటి, ఎందుకిలా వణకిపోతున్నావు? ఒంట్లో బాగాలేదా!" అన్నాడు. తరువాత ఆమె మెడనిండా ఉన్న నగలు, తలనిండా ఉన్న పూలు తీసి బల్లమీద ఉంచాడు. ఫాను ఫుల్‌గా వేశాడు, ఫానుకిందకు కుర్చీ లాగాడు. "రా, ఇలా వచ్చి కూర్చో, నీకు చెప్పాలి






పోస్తున్నాయి'' అన్నాడు. ఆమె యాంత్రికంగా లేచి వెళ్ళి కూర్చుంది. అతనూ దగ్గరగా కుర్చీ లాక్కుని కూరు న్నాడు. ఆప్యాయంగా అన్నాడు. "చూడు, ఇవ్వాళ్టి నుంచి మనిద్దరం స్నేహితులం చాలా ప్రియమైన స్నేహితులం. చక్కగా తెల్లవార్లు కబుర్లు చెప్పుకుందాం. అన్నీ మాట్లాడుకుందాం. ఏ:?" చిన్నగా నవ్వుతూ ఆమెకేసి చూశాడు. ఆమెకు మాటలు చాలా ప్రియంగా తోచాయి. ముచ్చెమటలు కొంచెం తగ్గాయి. అతను వెళ్ళి సోఫామీద దిండు పెట్టుకు పడుకున్నాడు. ఆమె వెళ్ళి అతని పాదాల దగ్గర కింద కూర్చుంది. ఎలాగో మనసు కుదుటపరుచుకుని గొంతు పెగల్చుకుని అంది.

"నేను మీతో చాలా సంగతులు చెప్పాలి" అతను నవ్వుతూ అన్నాడు. "చెప్పు వినటానికి సిద్ధంగా వున్నాను" ఆమె తటపటాయిస్తూ భయపడుతూ అంది. "మరీ, చిన్నప్పుడు ఒక సారి" అతను సరసమాడుతున్నట్లు నవ్వుతూ అన్నాడు. "ఊః చెప్పూ, మరీ చిన్నప్పుడు ఒకసారి___" ఆమె కలవరపడింది. ఎలాగో తల వంచుకుని చిన్నప్పుడు జరిగినవి, తనకు లీలగా గుర్తున్నవి చెప్పింది. చెబుతూ వెక్కి వెక్కి ఏడ్చింది. అతను హఠాత్తుగా లేచి ఆమెను గుండెలకు గట్టిగా అదుముకున్నాడు. "వెఱ్ఱిపిల్లా! ఏమీ జరగలేదు, ఏమీ కాలేదు, ఊరికే ఏడవకు. ఊరికే బాధపడకు" అన్నాడు. ఆమెను ఇంకా ఇంకా గట్టిగా గుండెలకు అదుముకున్నాడు. నుదుటిమీద ముద్దు పెట్టుకున్నాడు. ఆమె ఊరట పొందింది. అతని గుండెల్లో ఒదిగి తల దాచుకుంది. రెండు చేతులతో అతనిని పెనవేసుకుంది. కన్నీరు తుడుచుకుంది. "ఇన్నాళ్ళకు తనకొక స్నేహితుడు దొరికాడు. చాలా మంచి స్నేహితుడు దొరికాడు" ఈ భావం మనసులో గాఢంగా నాటుకుంది. మనసు ప్రశాంతత పొందింది. చాలా రోజులుగా మనసులో దాగిన వేదన మాయమైంది.

***

మా ఖాతాదారులకు, శ్రేయోభిలాషులకు

దీపావళి శుభాకాంక్షలు

ఫోన్ నెం. 74726, 86328, రెసి. 61644

# శ్రీ సూర్యా మోటార్ వర్క్స్

పయినీర్స్ ఇన్ ఆటోమోబైల్స్ ఇండస్ట్రీ.

బీసెంటు రోడ్, గవర్నర్ పేట, విజయవాడ - 520 002

బ్రాంచి: ఆటోనగర్

పార్ట్నర్స్: సి. హెచ్. సూర్యనారాయణ అండ్ బ్రదర్స్

అన్ని విధములైన ఆటోమొబైల్ పనులకు అన్నిరకముల లేత్‌వర్క్సుకు ఆధునిక యంత్రములపై అనుభవముగల పనివారిచే సకాలంలో

రీ బోరింగ్, క్రాంక్ గ్రైండింగ్, ఓరింగ్, రీ కండిషనింగ్ వగైరా రిపేర్సు చేయబడును

"METCO" మెటల్ స్ప్రేయింగ్ మా ప్రత్యేకత

ఒకసారి దయచేసి ప్రయత్నించిన మీకే తెలియగలదు